శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని శైవక్షేత్రాలు శుక్రవారం శివనామస్మరణతో మార్మోగాయి.భక్తులు వేకువజామునే ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. మహిళలు పెద్దసంఖ్యలో శివాలయాలకి చేరుకుని 365వత్తులతో కార్తిక దీపాలను వెలిగించారు.

ముత్యాలంపాడులో......

స్థానిక ముత్యాలంపాడులోని శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామిదేవాయలంలో మహన్యాస పూర్వక ఏకరుద్రాభిషేకం నవగ్రహాభిషేకం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా మధ్యాహ్నం ఒంటిగంటకి మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకం , స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన బిల్వపత్రాలతో లక్షబిల్వార్చన చేశారు. అనంతరం భక్తుల కోలాహలంతో నందాదీప సేవ, జ్వాలాతోరణం జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పరమేశ్వరునికి పూజలు అభిషేకాలు చేశారు. మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.

అయోధ్యనగర్‌లో...

స్థానిక అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి ఏడు గంటలవరకు వేదపండితుల మంత్రోచ్ఛారణలతో సహస్రలింగార్చన చేశారు. సాయంత్రం భక్తుల సన్నిదిలో జ్వాలాతోరణం వైభవంగా సాగింది.

శ్రీదత్తసాయి మందిరంలో..

మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని దీపోత్సవం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు దీపోత్సవంలో పాల్గొని పూజలు చేసి కార్తిక దీపాలను వెలిగించారు. తొలుత ఆలయంలోని చంద్రశేఖర స్వామివారికి అన్నాభిషేకం చేసి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.



శ్రీదత్తసాయి మందిరంలో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

సామూహిక సత్యనారాయణ వ్రతాలు..

కార్తిక మాసోత్సవాల్లో భాగంగా ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో ఆలయకమిటీ ఆధ్వర్యాన శుక్రవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు జరిగాయి. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని వ్రతాన్ని ఆచరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

మధురానగర్‌లో...

మధురానగర్ శ్రీభగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో గణపతి సహిత లక్ష్మీగణపతి హోమం, రుద్ర, సుదర్శన, ఆదిత్య నవగ్రహ, సర్వదేవతల హోమం చేశారు. సామూహిక సత్యనారాయణవ్రతాన్ని చేశారు. కార్యక్రమాలను మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎస్ రాజు పర్యవేక్షించారు.

శివరామక్షేత్రంలో..

విజయవాడ కల్చరల్: కార్తిక పౌర్ణమి సందర్భంగా నగరంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివ నామస్మరణతో మార్మోగాయి. శృంగేరీ పీఠపాలిత శివరామ కృష్ణ క్షేత్రంలో శుక్రవారం ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు క్యూలైన్లలో వేచి ఉన్నారు. దీపం జ్యోతి పరబ్రహ్మ దీపం జ్యోతి పరాపరాత్పర అంటూ కార్తీక దీపాలను వెలిగించి పూజలు చేశారు. జ్వాలా తోరణం వెలిగించారు. క్షేత్ర ధర్మాధికారి శిష్టా హనుమత్ ప్రసాద్ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా ఏర్పాట్లు చేశారు. లబ్బీపేట శారదా చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలోనూ కార్తిక శోభ కనిపించింది. స్వామివారికి అర్చకులు బిల్వార్చన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా టీటీడీ దేవస్థానంలోనూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు. టెంపుల్ ఇనస్పెక్టర్ సీహెచ్ లలితా రమాదేవి పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో జ్వాలాతోరణం..

తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మనగుడి కార్యక్రమంలో భాగంగా విజయవాడలో శుక్రవారం జ్వాలా తోరణం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. బీఆర్‌టీఎస్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో పరమేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ధర్మ ప్రచార పరిషత్ ప్రోగామ్ అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ ఆధ్వర్యంలో సాయంత్రం కార్తిక దీపాలను వెలిగించారు. భక్తులకు తులసి మొక్కలను పంపిణీ చేశారు.



టీటీడీ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం



హోమం జరిపిస్తున్న భక్తులు

శివారాధన.. అనంత కోటి పుణ్యఫలం

మల్లాది విష్ణు



మల్లాది విష్ణును ఆశీర్వదిస్తున్న వేద పండితుడు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కార్తీక పౌర్ణమి నాడు శివుని ఆరాధిస్తే అనంత కోటి పుణ్యఫలం లభిస్తుందని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. గవర్నర్‌పేట చల్లపల్లి బంగ్లా సమీపంలో వేంచేసియున్న శ్రీకాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో మల్లాది విష్ణు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో రుద్రాభిషేకం నిర్వహించగా, వేద పండితులు మల్లాది విష్ణుకు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తిక మాసంలో వచ్చే పౌర్ణమి హిందువులకు ఎంతో పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు. శివుడు, శ్రీమహావిష్ణువులని ఎంతో భక్తి శ్రద్ధలతో పూజించి, వారి అనుగ్రహం పొందేందుకు కార్తికమాసం కన్నా పవిత్రమైనది మరొకటి లేదని పేర్కొన్నారు. ఈ పర్వదినం రోజున కలిగినంతలో దానాలు చేస్తే సత్ఫలితాలు లభిస్తాయన్నారు. ఆ ముక్కంటి కరుణా కటాక్షాలు సెంట్రల్ నియోజకవర్గ ప్రజలపైన, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఎల్లవేళలా ఉండాలని కాంక్షించారు.

క్లుప్తంగా

ఘనంగా సినీహీరో కృష్ణ వర్ధంతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సినీనటుడు సూపర్‌స్టార్ కృష్ణ రెండో వర్ధంతిని ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సుధాస్వామి ఆధ్వర్యంలో అభిమానులు స్థానిక లెనిన్ సెంటర్లోని ఓం. శ్రీషిర్డినాగసాయి బాబా, నాగమానసాదేవి మందిరంలో అభిమానులు వృద్ధులు, మహిళలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. బాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. కృష్ణ ఫ్యాన్స్ సభ్యులు కె. విజయ్, శ్రీరాజ్, నర్రా జగన్‌మోహనరావు, బాబూరావు, టైలర్, ధనుంజయ్, అనీల్, ప్రేమ్, పండు, అన్నమయ్య పాల్గొన్నారు.

భూమిపూజ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట 23వ డివిజన్‌లో ఉన్న కమలా నెహ్రూ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ప్రహరీ నిర్మాణానికి ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి శుక్రవారం భూమిపూజ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు హాస్టల్ ప్రహరీ కూలిపోయింది. దీంతో ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు రూ.10లక్షలు మంజూరుకావడంతో భూమి పూజ చేశారు.

చిన్నారులకు స్వెట్టర్ల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): బీఆర్‌టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మదర్సా చిన్నారులకు శుక్రవారం నూతన వస్త్రాలు, స్వెట్టర్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు కోరంగి నాగమల్లిక, షఫీవుల్లా పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్యరూపకం



విజయవాడ కల్చరల్: శ్రీకనదుర్గా నృత్యమందిర్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించే యల్లా జోస్యుల రామకృష్ణ నృత్యోత్సవాలు దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య కళాశాలలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ప్రదర్శనగా స్వతంత్ర భారతి రమేష్ రచించి యల్లా జోస్యుల అనూరాధ నృత్య దర్శకత్వం వహించిన వినాయక చవితి నృత్య రూపకాన్ని నయన మనోహరంగా ప్రదర్శించారు. కార్యక్రమాన్ని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా జ్యోతిని వెలిగించి కార్యక్రమాలను ప్రారంభించారు. నాట్యాచార్యుడు యల్లాజోస్యుల రామకృష్ణ నృత్యసేవలను వివరించారు. నాట్యాచార్యుడు చింతా వెంకట్, డాక్టర్ ఎజే ప్రకాష్ కూచిపూడి నృత్య సంప్రదాయం అంశంగా ప్రసంగించారు. యల్లా జోస్యుల అనూరాధ, నేతి విద్యాసాగర్ పాల్గొన్నారు.

సంచార జాతులను ఎస్టీల్లో చేర్చాలని వినతి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అత్యంత వెనుకబడిన సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ సంచార జాతుల సంఘం సమావేశం తీర్మానించింది. విజయవాడ ఐలాపురం హోటల్‌లో ఏపీ సంచారజాతుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. ప్రధానంగా 1961లో ట్రైబల్ ఎంక్వైరీ కమిటీ చైర్మన్ వెన్నెలగంటి రాఘవయ్య నివేదిక ప్రకారం సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు పెంద్ర వీరన్న మాట్లాడుతూ ఆ నివేదికలు అమలు చేసేంత వరకు పోరాటాలు చేస్తామన్నారు. అన్ని జిల్లాల కలెక్టర్లను కలిసి సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వినతి పత్రాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సంచార జాతుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి అనపర్తి ఏడుకొండలు, రాష్ట్ర కార్యదర్శి అన్నపురెడ్డి వీర రాఘవులు, ముస్లిం సంచారజాతుల సంఘం నాయకులు షేక్ హేమావలి, జిల్లా అధ్యక్షులు చుండూరు ముసలయ్య, వనపర్తి భీమన్న, చిన్న ఆంజనేయులు యువజన విభాగం చిన్న కత్తుల మంగరాజు, పెంద్ర జాన్ మోషే, దాసరి వెంకటేశ్వరరావు,కత్తి కొండయ్య, ముసలియ్య, వాడపల్లి నరసన్న, ప్రసాద్ పాల్గొన్నారు

వీఎంసీ షెల్టర్ హోమ్స్ నిర్వహణపై పరిశీలన



షెల్టర్ హోంలలో వసతులను అడిగి తెలుసుకుంటున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించే షెల్టర్ హోమ్స్ నిర్వహణ విధానాన్ని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పరిశీలించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం రాణిగారి తోట, హనుమాన్ పేట, గవర్నర్ పేట, చిట్టి నగర్‌లోని షెల్టర్ హోంలను పరిశీలించారు. షెల్టర్ హోమ్స్‌లో ప్రస్తుతం ఉన్న భోజన, మరుగుదొడ్లు, మెడికల్ క్యాంపులు, పడక, వసతులపై ఆరా తీశారు. షెల్టర్ హోంలో ఎంతమంది ఉంటున్నారు, ఎక్కడి నుంచి వస్తున్నారు వంటి అంశాలపై వారితో స్వయంగా మాట్లాడి, అక్కడ కనిపిస్తున్న వసతులు, వారి వివరాలు తెలుసుకున్నారు. రాణి గారి తోటలో ఉన్న షెల్టర్ హోమ్‌లో మరుగుదొడ్లు పాడైపోవడం గమనించి త్వరితగతిన మరుగుదొడ్లను యూసీడీ అనుసంధానంతో మరమ్మతులు చేయాలని, భవనానికి వెంటనే రంగులు వేయించాలని అధికారులను ఆదేశించారు. ఏ కారణం వల్ల నిరాశ్రయులయ్యారు? ఎప్పటినుంచి ఉంటున్నారు? వారికి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉన్నారా? ఇలాంటి అంశాలను యూసీడీ విభాగం వారిని తెలుసుకుని నివేదిక సమర్పించాలని ఆదేశించారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందడం కోసం వచ్చే ప్రజలు, వారి కుటుంబ సభ్యులకు చికిత్స పొందే వరకు కుటుంబ సభ్యులు ఉండటానికి ఆశ్రయం కల్పించే విధంగా పాత గవర్నమెంట్ హాస్పిటల్ దగ్గర నూతన షెల్టర్ హోమ్ ఏర్పాటు చేసేటట్టు చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం వారి నేషనల్ అర్బన్ లైవ్ హెడ్ మిషన్ 2.0 పైలెట్ ప్రాజెక్టు లో భాగంగా ఇతర ప్రదేశాల నుంచి పని కోసం వచ్చి నిరాశ్రయులుగా ఉండే వర్కర్లకు లేబర్ డిపార్టుమెంట్ సమన్వయంతో సంయుక్త పరిశీలన చేసి లేబర్ చౌక్ ఏర్పాటు చేసేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌యూఎల్ఎం పైలెట్ ప్రాజెక్టు ద్వారా ఏర్పాటు చేసే షెల్టర్ హోమ్స్‌లో నిరుపేదల జీవన ఉపాధి కోసం ఒకటి సిటీ లైవ్లీహుడ్ సెంటర్లు కూడా ఏర్పాటు చేసేటట్టు చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) వెంకట నారాయణ, ఇన్‌చార్జ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం, యూసీడీ సాంకేతిక నిపుణురాలు సుజాత పాల్గొన్నారు.

ఫైనాన్సర్ల వేధింపులు అరికట్టాలి : సీఐటీయూ



ధర్నా చేస్తున్న ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటో యజమానులపై ప్రైవేట్ ఫైనాన్సర్ల వేధింపులు అరికట్టాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ నందు ఆటో యజమానులపై వేధింపులు అరికట్టాలని కోరుతూ విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి ఎన్.సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగా ఆటో, మోటార్ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆటో కార్మికులను ఆదుకోవాల్సింది పోయి వేధింపులకు గురి చేయడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఆటో కార్మికులకు ప్రభుత్వ బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చిందని, అధికారం చేపట్టి ఐదు నెలల గడుస్తున్నా హామీ అమలు కాలేదన్నారు. ఆటో యజమానులు ప్రైవేట్ ఫైనాన్సర్లను ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం జోక్యం చేసుకుని ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు మాట్లాడుతూ ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం ద్వారా ఆటో యజమానులతో పాటు కార్మికులకు కూడా రూ.10 వేలు ఇస్తామన్న వాగ్దానాన్ని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంతరావు, తూర్పు సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.రూబేనుకుమార్, రాజరాజేశ్వరి పేట ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వై.రమణబాబు, పడగల గణేష్ (చిన్నా), ఆటో వర్కర్స్ యూనియన్ నగర నాయకులు విజ్జి. చిన్నారావు, బి.లక్ష్మణ, డి.కాశేశ్వరరావు, వై. దుర్గారావు, ఎస్.కె ఫరీద్, బి.విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వీఎంసీలో భగవాన్ బిర్సా ముండాకు ఘన నివాళి



బిర్సా ముండాకు నివాళులర్పిస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): గిరిజన ఉద్యమంలో దేశానికి దిక్సూచిగా ఉన్న బిర్సాముండాను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, గిరిజన హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్ అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బిర్సాముండా జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ బిర్సా ముండా భారతీయ అటవీ జాతుల స్వాతంత్ర్య సమరయోధుడని, జానపద నాయకుడని, ముండా జాతికి చెందిన ఆయన 19వ శతాబ్దపు చివరి రోజుల్లో, నేటి బీహార్, ఝార్ఖండ్ అటవీ ప్రాంతాల్లో, బ్రిటిష కాలంలో జరిగిన మిలీనేరియన్ ఉద్యమానికి సారథ్యం వహించారన్నారు.అతని గౌరవార్థం భారత పార్లమెంటులోని సెంట్రల్ హాల్లో చిత్రపటం ఏర్పాటుచేశారని వివరించారు. ఈ వేడుకల్లో అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణ, జాన్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, మేనేజర్ ఏయూబీ శర్మ, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

తొలితరం పోరాట ఫలితమే సుప్రీంతీర్పు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఉద్యమ తొలితరం నాయకత్వం చేసిన పోరాట ఫలితంగానే నేడు వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మానికొండ శ్రీధర్ అన్నారు. ఇది ఏఒక్కరి వల్లో వచ్చింది కాదన్నారు. స్థానిక మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యాలయంలో శుక్రవారం విజయవాడ ఫిలింఛాంబర్‌లో శనివారం నిర్వహించనున్న సభ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం కొందరు బాడుగ నేతలు తామే రిజర్వేషన్ల వర్గీకరణ సాధించినట్లు ఆంధ్రలో విజయోత్సవాలు జరుపుతున్నారన్నారు. వర్గీకరణ ద్వారా మాదిగ, ఉప కులాలకు పూర్తిన్యాయం జరిగేలా కార్యచరణ కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో ఇప్పటి నాయకత్వం తీసుకునే నిర్ణయానికి మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ నాయకులు పరస రామయ్య మాదిగ, అర్బన్ నాయకులు చుక్కా నరేష్ మాదిగ, మాతంగి సంజయ్ మాదిగ, ఆలేటి ఏసు పాదం మాదిగ, వీర్ల అన్వేష్ బాండ్, జాగర్లమూడి బాలాజీ మాదిగ, మాదిగ కిన్నెర సృజన్‌మాదిగ, నోవా మాదిగ తదితరులు పాల్గొన్నారు

వైభవంగా శాంతికళ్యాణం



పాయకాపురం(విజయవాడరూరల్): కుందావారి కండ్రికలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్మించిన 12ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆలయంలో మహాకుంభాభిషేకం, శాంతి కళ్యాణం నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఎనిమిదో తరం మునిమనువడు శ్రీవీరభద్రస్వామి సతీసమేతంగా ఆలయానికి విచ్చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మంగళాపురం, కుందావారికండ్రిక, నున్న ప్రాంతాలకు చెందిన బ్రహ్మంగారి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ మహాకుంభాభిషేకాన్ని పురస్కరించుకుని విశ్వబ్రాహ్మణ పురోహిత్ పరిషత్ రాష్ట్ర నాయకులు అరికట్ల గోవర్ధన శాస్త్రి బృందంచే మూడు రోజులు వివిధ ప్రత్యేక పూజలు, శాంతిహోమం నిర్వహిస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

జీవన మంజూష పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బందరు రోడ్డులోని ఠాగూర్ గ్రంథాయలంలో నవ మల్లెతీగ ఆధ్వర్యంలో రచయిత్రి మంజు యనమదల రచించిన జీవన మంజూష పుస్తకాన్ని ఏపీ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేస్తామని హామీనిచ్చారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి మహ్మద్ ఇంతియాజ్ మాట్లాడుతూ కవులు రచయితలు సమాజంలో భాగస్వాములు కావాలన్నారు. సమాజాన్ని నిరంతరం అధ్యయం చేయాలని సూచించారు. సాహితీ ప్రముఖులు గోళ్ల నారాయరావు, డాక్టర్ ఎం.ప్రభాకర్, శ్రీరామకవచం సాగర్ మంజు సాహిత్య జీవిత విశేషాలను వివరించారు ఠాగూర్ గ్రంథాలయ పాలకురాలు రమాదేవి, నవమల్లెతీగ వ్యవస్థాపకుడు, కలిమిశ్రీ, సాహిత్యవేదిక సభ్యులు కుర్రా రాఘవేంద్ర శేఖర్ నిర్వహించారు.

పుస్తకపఠనం అలవరచుకోవాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాల్యం నుంచే విద్యార్థులు పుస్తకపఠనం అలవరచుకోవాలని ఎస్‌బీఐ మెట్రో రీజినల్ మేనేజర్ ఏవీఆర్ సుబ్బారావు సూచించారు. బందరురోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో సాహిత్యం, కథలు, కవితలు, ఆరోగ్యం, జ్యోతిషం, వాస్తు, సైకాలజీకి సంబంధించిన పుస్తకాలను ప్రదర్శించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ అధికారి కే రమాదేవి ఎస్‌బీఐ ఆర్ఎంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మేనేజర్ విజయ్ కుమార్ గ్రంథాలయ సిబ్బంది వై.ధనలక్ష్మి, ఈజీఎస్ కుమార్, పి.నాగమణి, ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఔట్ ఫాల్ డ్రైన్ల నిర్వహణలో స్కాడా సిస్టం వినియోగించాలి



బుడమేరు వరద ప్రభావిత ప్రాంతంలో పర్యటిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అవుట్ ఫాల్ డ్రైన్ల నిర్వహణ చేపట్టాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కేఎల్ రావు నగర్ ఔట్ ఫాల్ డ్రైన్, వరద ప్రభావిత ప్రాంతాలైన అజిత్‌సింగ్ నగర్, కండ్రిక రాజీవ్ నగర్, బుడమేరు పరివాహక ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేఎల్ రావు నగర్ లోని అవుట్ ఫాల్ డ్రైన్ పూడికలు తీసి నీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాకు వినియోగించే స్కాడా విధానాన్ని మురుగునీటి పారుదలకు వినియోగించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. స్కాడా ద్వారా వర్షపు నీరు రోడ్డుపైన నిలవకుండా డ్రైన్లలో ప్రవహించేటట్టుగా చర్యలు తీసుకోవచ్చని అధికారులకు సూచించారు. విజయవాడ నగరాన్ని గుంతలు లేని నగరంగా చేయాలని, నగరంలో ఉన్న గుంతలను త్వరితగతిన పూడ్చాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన సర్కిల్-2 పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలైన బుడమేరు వంతెన, అజిత్ సింగ్ నగర్ ఫ్లైఓవర్ నుంచి నున్న సరిహద్దు వరకు పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాడైపోయిన రోడ్లు, డివైడర్లు, పేవర్ బ్లాక్స్, ఫుట్‌పాత్‌లకు త్వరితగతిన మరమ్మతులు చేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో చీఫ్ ఇంజినీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, జోనల్ కమిషనర్ రమ్య కీర్తన, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరిండెంట్ ఇంజినీర్లు పి.సత్యనారాయణ, పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర రెడ్డి, డీఈఈప్రభాకర్, వెహికల్ డిపో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇన్‌చార్జ్ యేసుపాదం పాల్గొన్నారు.

ఐదుగురు ఆర్‌ఐలు బదిలీ

సాక్షి ఎఫెక్ట్

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ రెవెన్యూ విభాగంలో ఆస్తి, ఖాళీస్థలాల పన్నుల వ్యవహారంలో చోటుచేసుకున్న అవకతవకలపై ఈనెల 5వ తేదీన 'సాక్షి' దినపత్రిక 'పన్ను వేయాలంటే వెన్ను వెణకాల్సిందే' శీర్షికతో ప్రచురించిన కథనంపై వీఎంసీ కమిషనర్ స్పందించారు. సెంట్రల్ నియోజకవర్గంలో వీఎంసీ రెవెన్యూ సెక్షన్‌లో ఆర్‌ఐలుగా విధులు నిర్వహిస్తున్న ఐదుగురు ఉద్యోగులను అక్కడి నుంచి స్థాన చలనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్-2లో ఆర్‌ఐ-5గా విధులు నిర్వహిసుతన్న కె.కళ్యాణచక్రవర్తిని ఆర్‌ఐ-7గా బదిలీ చేయగా ఆయన స్థానంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న బి.శ్రీనివాసరావును నియమించారు. ఆర్‌ఐ13గా విధులు నిర్వహిస్తున్న ఎం. శ్యాం సురేంద్రబాబును ఆర్‌ఐ-5గా బదిలీ చేశారు. సర్కిల్-3 పరిధిలో ఆర్‌ఐ-9గా విధులు నిర్వహిస్తున్న ఆర్‌ఐ ఎస్.నాగరాజును ఆర్‌ఐ-12గా బదిలీ చేయగా, ఆయన స్థానంలో మారుతీరావును బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సర్కిల్-1 పరిధిలో ఆర్‌ఐ-4గా విధులు నిర్వహిస్తున్న ఎం.రమణను కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ప్రజారోగ్యం విభాగం ఎఫ్-1గా బదిలీ చేయగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జి.ప్రకాష్‌సాగర్‌ను ఆర్‌ఐ-4గా బదిలీ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆకట్టుకునే దేవకీ నందన వాసుదేవ



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఈ నెల 22న విడుదల కానున్న దేవకీ నందన వాసుదేవ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని హీరో మహేష్‌బాబు మేనల్లుడు, ఆ చిత్ర హీరో అశోక్ గల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా యూనిట్ సభ్యులు శుక్రవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ సెన్సేషనల్ హిట్ సాధించిన హనుమాన్ చిత్ర దర్శకుడు ప్రశాంత్ వర్మ అందించిన కథతో అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న దేవకీ నందన వాసుదేవ చిత్రం ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందన్నారు. ఈ చిత్రంలో థ్రిల్లర్ అంశాలు ప్రేక్షకులకు మధురానుభూతిని కలిగిస్తాయన్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరియో అందించిన సంగీతం, బీజీఎం సినిమాకు హైలెట్‌గా ఉంటుందన్నారు. మానస వారణాసిని హీరోయిన్‌గా తెలుగు తెరకు పరిచయం చేస్తున్నామన్నారు. అనంతరం హీరోయిన్ మానస వారణాసి మాట్లాడుతూ తెలుగుదనం ఉట్టిపడేలా తన పాత్ర ఉంటుందని చెప్పారు. సమావేశంలో చిత్ర నిర్మాత బాలకృష్ణ సోమినేని కూడా పాల్గొన్నారు.

బాల కార్మికులులేని సమాజాన్ని నిర్మిద్దాం

అరవ రమేష్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బాల్యవివాహాలు, బాల కార్మికులు, బాలలపై హింస లేని సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములవుదామని ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కోఆర్డినేటర్ అరవ. రమేష్ అన్నారు. గవర్నర్‌పేటలోని సీవీఆర్ స్కూల్‌లో ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా బాలల కోసం ఏర్పాటు చేసిన అవగాహన చైతన్య కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండేలా చూసి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. బాలలపై లైంగిక వేధింపులు లేకుండా చూడాలన్నారు. బాలలు అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త వహిస్తూ ఏదైనా ఇబ్బందులు కలిగితే వెంటనే పెద్దలకు, తల్లిదండ్రులకు గాని లేదా చైల్డ్ హెల్ప్ లైన్ 1098గాని తెలియజేయాలని కోరారు. అనంతరం అవగాహన వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. బాలలహక్కుల పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బర్డ్స్ సంస్థ సెక్రటరీ కోటే ప్రకాష్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు ఇంటి రాజు, సూర్య కృష్ణ, బాలల హక్కుల కార్యకర్త పెండ్యం విజయ్ కుమార్, పాఠశాల, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.